క్లుప్తంగా

రేపు కంకలమ్మ ఆలయంలో పూజలు

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై గల కంకలమ్మ దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య సోమవారం తెలిపారు. ఆలయంలో రేపు ఉదయం 9.15 గంటలకు పల్లకి సేవ, 11.15 గంటలకు మహా రుద్రయాగం, అర్ధ రాత్రి 12 గంటలకు సహస్ర బిల్వార్చన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. గో ధూళికా ముహూర్తన కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు ఆలయంలో ఏర్పాట్లు చేశామని, మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు


ఎంఈవోకు జాయినింగ్ లెటర్ సమర్పిస్తున్న నూతన టీచర్లు

కెరమెరి: 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు సోమవారం వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ తెలిపారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల కెలికేలో కవిత, జన్కాపూర్ పాఠశాలలో స్వప్న చేరినట్లు ఆయన తెలిపారు. వీరిద్దరు నిర్మల్ జిల్లాకు చెందిన వారు. కాగా ఇటీవల మండలంలోని నిసాని ప్రాథమిక పాఠశాలలో సుమలత జైన్ చేరారు. ఈ మేరకు టీచర్లు నియామక పత్రాన్ని ఎంఈవోతో పాటు కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు అందించారు.

నేడు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మంగళవారం బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదట బెజ్జూర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టి ఉదయం 10 గంటలకు విలేకరుల సమావేశంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో, 2 గంటలకు దహెగాంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు.

'ఆశయంతో ప్రయత్నం చేయాలి'

నార్నూర్: ఆశతో కాదు ఆశయంతో ప్రయత్నం చేస్తే విజయం సొంతమవుతుందని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ అన్నారు. గాదిగూడ మండలంలోని డాబా బి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ క్రీడా పోటీలను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుకు రావాలన్నారు. క్రీడలు ఆడుతూ ఓపిక, సంకల్పంతో ప్రయత్నం చేస్తే విజయం సొంతమవుతుందన్నారు. గ్రామస్తులు హెచ్‌కే అనిల్, ఆత్రం విజయ్, మెస్రం గోవింద్, సోనేరావు, బాదిరావు, మాజీ సర్పంచ్ పెందూర్ తానాజీ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయంలో సోమవారం నిర్వహించిన శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితులు గ్రామానికి చెందిన దంపతులతో యజ్ఞం నిర్వహించారు. ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన, జోడు నాగుల విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణాన్ని భక్తులు తిలకించారు.

తాంసి: మండల కేంద్రంలో సోమవారం శివ దీక్షాదారులు శివపార్వతుల పల్లకిని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉత్సవమూర్తులను ఉంచి శివాలయం నుంచి ఊరేగింపు నిర్వహించారు. గ్రామం శివనామ స్మరణతో మార్మోగింది. మహిళలు మంగళ హారతులతో పూజలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన

ఇచ్చోడ: మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇంటింటా సర్వే నిర్వహించి ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. తర్వాత సూపర్ చెక్ ద్వారా లబ్ధిదారుల పేర్లను యాప్‌లో లాగిన్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన తుది జాబితాను పరిశీలిస్తున్నామన్నారు. అర్హులైన వారికి గృహ నిర్మాణం శాఖ ద్వారా మార్క్‌ఔట్ ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అద్దెకు వ్యవసాయ యంత్రాలు

- రైతులకు ప్రయోజనకరం
- తక్కువ ధరలకే అందుబాటులో..
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు


అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న యంత్రాలు

తిర్యాణి: చాలా మంది రైతులు సాగు చేసేందుకు అవసరమయ్యే యంత్రాలు లేక అనేక ఇబ్బందులు పడుతుంటారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద యంత్రాలను అద్దెకు తీసుకుంటుండడంతో రైతులకు ఆర్థికంగా భారం కలుగుతోంది. దీనిని నివారించేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. తక్కువ ధరలకే రైతులకు రోజువారీ అద్దె రూపంలో యంత్రాలను అందిస్తున్నారు. దీంతో అటు మండల సమాఖ్య ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు సైతం లబ్ధి చేకూరుతోంది.

రైతులతో ఒప్పందం..

మండల సమాఖ్య సభ్యులు రైతులకు యంత్రాలను ఇచ్చే సమయంలో వారి నుంచి ఒప్పందం చేసుకుంటారు. ఈ ఒప్పందం ప్రకారం ఎన్ని రోజులకు అద్దె తీసుకుంటున్నారో అందుకు అయ్యే రుసుంలో 50శాతం ముందుగా అడ్వాన్స్ కింద చెల్లించాల్సి ఉంటుంది. అద్దెకు తీసుకున్న సమయంలో యంత్రాల పరికరాలు చెడిపోవడం, మరమ్మతులకు గురైతే వాటి భారాన్ని రైతులు చెల్లించాల్సి ఉంటుంది. రైతులు యంత్రాలను అద్దెకు తీసుకునే క్రమంలో పట్టాపాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లను అందజేయాల్సి ఉంటుంది.

అద్దెకు లభించే యంత్రాలు ఇవే..

జంగుబాయి సమాఖ్య కార్యాలయంలో మొత్తంగా 11 రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వాటిని రోజు లెక్కన అద్దెకు ఇస్తుంటారు. కాగా ట్రాక్టర్ అద్దె (ఒక రోజుకు) రూ. 1400, ట్రాలీ రూ. 600, ప్లావ్ రూ.500, కల్టివేటర్ రూ. 500, కాటన్ షెడ్డర్, రోటవెటర్ రూ. 1000, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లర్ రూ.1000, పవర్ వీడర్ రూ.500, బూమ్ స్ప్రేయర్ రూ. 1000, తైవాన్ స్ప్రేయర్ రూ.200, బ్యాటరీ స్ప్రేయర్ రూ.100లను రోజూ వారి అద్దెగా నిర్ణయించారు. అయితే మహిళ సంఘాలలోని సభ్యులకు మరింత తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఆయా యంత్రాలను మండలంలోని రైతులతో పాటు ఇతర మండలాలకు చెందిన రైతులు కూడా అద్దెకు తీసుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం సాగు పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో రైతులకు ఈ అద్దె యంత్రాలు ఎంతగానో తోడ్పడనున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

మండల సమాఖ్య కార్యాలయంలో అతి తక్కువ ధరకు 11 రకాల యంత్రాలను అద్దెకు ఇస్తున్నాం. ఇందుకోసం రైతుతో ముందుగానే ఒప్పందం చేసుకుంటున్నాం. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే మండల సమాఖ్యలో అతి తక్కువ ధరకే యంత్రాలను ఇస్తుండటంతో రైతుల నుంచి మంచి స్పందన వస్తోంది. మహిళా సంఘాల్లోని సభ్యులకు అద్దెను మరింత తగ్గిస్తున్నాం. **- శ్రీనివాస్, ఏపీఎం, తిర్యాణి**

బ్రహ్మోత్సవాలకు 'వెంకన్న' ముస్తాబు


వేంకటేశ్వర స్వామి ఆలయం

- 26 నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి తిరునాళ్లు
- ఘనంగా ఊరేగనున్న స్వామి వారి పల్లకి
- వారం రోజులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు
- భారీ సంఖ్యలో హాజరుకానున్న భక్తులు


గర్భగుడిలోని ప్రతిమలు

కెరమెరి: బ్రహ్మోత్సవాలకు వెంకన్న ముస్తాబవుతున్నాడు. మండల కేంద్రంలోని నెహ్రూనగర్‌లో బుధవారం నుంచి అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో శ్రీ వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నారు. ఈసారి వినూత్నంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ నిర్మాణం జరిగి దాదాపు 55ఏళ్లు పూర్తి కావస్తుంది. వేంటేశ్వర స్వామి ఆలయానికి ఆనుకునే అలివేలు మంగమ్మ ఆలయం కూడా ఉంది. కాగా గడిచిన 47 సంవత్సరాలుగా వేంకటేశ్వరస్వామి పేరిటా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటా ఈ ఉత్సవాలు ప్రారంభిస్తారు.

నేపథ్యం ఇదీ..!

పూర్వీకులు, పెద్దల కథనం ప్రకారం.. 1970వ సంవత్సరంలో నెహ్రూనగర్‌కు చెందిన తిమ్మయ్య అనే పుజారికి కలలో శ్రీ వారు దర్శనమిచ్చారు. తాను ఉన్న చోటు చెప్పి అక్కడ తవ్వితే తన విగ్రహం లభిస్తుందని, దాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపితే ఆయురారోగ్యాలతో పాటు సకల కార్యాలు సిద్ధిస్తాయని చెప్పాడు. దీంతో అక్కడ తవ్వడంతో విగ్రహం బయటపడింది. అనంతరం అదే చోట ఆలయం నిర్మించి నిత్యం పూజలు చేస్తున్నారు. 2003లో తిమ్మయ్య స్వర్గస్తుడు కాగా తదుపరి ఆయన తనయుడు లక్ష్మణ్ పూజలు నిర్వహిస్తున్నాడు.

పల్లకి ఊరేగింపు

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, బెంగుళూరు, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలకు చెందిన భక్తులు ఈ ఆలయానికి తరలివస్తారు. 26న ఉదయం 11 గంటలకు స్వామివారి అఖండ దీపారాధన, పల్లకి ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు మహాపూజ ఉంటుంది. ఈ నేపథ్యంలో వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేశారు.

నూతన జీఎంకు సన్మానం


శాలువాతో సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ భాస్కర్ రెడ్డిని సోమవారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎంను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి ఏరియా స్థితిగతులతో పాటు ఏరియాలో నెలకొన్న సమస్యలను నూతన జీఎం దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక సమస్యలకు పరిష్కారం చూపి న్యాయం చేయాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేషు, జగ్గయ్య, రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, రాజయ్య, ఫిట్‌కార్యదర్శులు శ్రీనివాస్, రామయ్య, అశోక్, హీరాలాల్, శివకృష్ణచారి, షిఫ్ట్ ఇన్‌చార్జీలు వెంకటేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలి


రిటైర్డ్ డైరెక్టర్ దంపతులను సన్మానిస్తున్న ఏరియా అధికారులు

రెబ్బెన: ఉద్యోగ జీవితాన్ని అనుభవించే ప్రతి ఒక్కరికి పదవీ విరమణతో ఉద్యోగానికి విరామం, విధులకు వీడ్కోలు ఉంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం సింగరేణి రిటైర్డ్ డైరెక్టర్ (పీఅండ్‌పీ) జీ. వెంకటేశ్వర్‌రెడ్డి ఏరియాకు రాగా ఆఫీసర్స్ క్లబ్‌లో రిటైర్డ్ డైరెక్టర్ దంపతులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అనంతరం జీఎం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రిటైర్‌మెంట్ అనేది సాధారణమన్నారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ఆనందంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, క్లబ్ కార్యదర్శి వీరన్న, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి అధికారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సెలవులు మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

కౌటాల: గత ఏడాది పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్థిక సెలవులు మంజూరు చేయాలని మండల యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో గావుడే హన్మంతుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల డ్యూటీ సర్టిఫికెట్లు అందించిన వెంటనే ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోయం ఇందురావ్, మండలాధ్యక్షులు రావుల వినోద్, సభ్యులు అంటోని, ధర్మయ్య, కృష్ణ, రావుజీ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కొలాం ఆదివాసీలు

కెరమెరి: ఒక వ్యక్తి అక్రమంగా చేసుకున్న భూమి పట్టాను రద్దు చేయాలని కొలాంగూడ (కెలిబి) గ్రామానికి చెందిన ఆదివాసీలు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సేవంతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని కెలికే గ్రామ శివారులో భీమన్న దేవుని ఆలయానికి సంబంధించిన ఎకరం భూమిని సాంగ్వి గ్రామానికి చెందిన మొహర్లే శంకర్ కబ్జా చేసుకుని అక్రమంగా పట్టా చేసుకున్నట్లు ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి కుల దైవానికి సంబంధించిన భూమిని విడిపించాలని, పట్టాను రద్దు చేసి న్యాయం చేయాలని కోరారు. కొలాం ఆదివాసీలు మడావి భీంరావు, మడావి మాన్కు, మడావి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

'సిద్ధి హనుమాన్' జాతరకు ఆహ్వానం


ఎమ్మెల్సీ విఠల్‌ను ఆహ్వానిస్తున్న సభ్యులు

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలోని వార్ధా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ను ఆలయ కమిటీ సభ్యులు కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం రాత్రి కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. అలాగే జాతరకు రావాలని మహారాష్ట్రలోని రాజురా ఎమ్మెల్యే దేవ్‌రావ్ భోంగడేకు కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల 26న మహాజాతర నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు తెలిపారు. కార్యక్రమాల్లో బొమ్మకంటి మనీష్, సంతోష్, ప్రవీణ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

బారులుదీరిన వాహనాలు


రోడ్డుపై నిలిపిన పత్తి వాహనాలు

కౌటాల: కౌటాల -మొగడ్‌దగడ్ రోడ్డు సమీపంలోని వైష్ణవి మాత జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐలో పత్తి విక్రయించేందుకు ఆయా గ్రామాల నుంచి భారీగా పత్తి వాహనాలు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీసీఐ సర్వర్‌డౌన్ కావడంతో రెండు వారాల అనంతరం పత్తి కొనుగోళ్ల ప్రారంభం కావడంతో వందలాది పత్తి వాహనాలతో జిన్నింగ్ మిల్లు నుంచి పెట్రోల్ పంపు వరకు దాదాపుగా 2 కిలోమీటర్ల మేర వాహనాలను క్యూలో నిలిపివేశారు. సోమవారం కౌటాల వారసంత కావడంతో మండలంలోని మొగడ్‌దగడ్, వీర్దండి, తాటినగర్, భాలేపల్లి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామాల నుంచి వారసంతకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మీదనే పత్తిలోడ్ వాహనాలను నిలిపివేయడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భంలో వాహనదారులకు తిప్పలు తప్పలేదు. జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు


డీలర్‌పై కేసు నమోదు చేస్తున్న అధికారులు

దహెగాం: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో భాగమైన దహెగాం మండలం బీబ్రా గ్రామం రేషన్ డీలర్ కనక లక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ నెల 11న సిర్పూర్(టి) మండలం హుడికిలి వద్ద పట్టుబడిన 208 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం కేసులో విచారణలో భాగంగా బీబ్రా రేషన్ డీలర్ గన్నీ బ్యాగులను తరలించినట్లు తేలిందన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో భాగమైన రేషన్ షాపును బినామీగా నడుపుతున్న తణుకు శ్రీనివాస్‌పై బినామీ కేసు, అసలు రేషన్ డీలర్ కనక లక్ష్మిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ, ఆర్ఐ శృతి తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థల్లో పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

అలరించిన వీడ్కోలు సమావేశం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దహెగాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వీడ్కోలు పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అధ్యాపకులు అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దౌలత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రశ్నించే వారికి పట్టం కట్టండి'


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ కొమురయ్య, అంజిరెడ్డిలకు ఎన్నికల్లో ఓటర్లు పట్టం కట్టాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. సోమవారం కౌటాలలోని మయూరి విద్యాలయం, భారతీ విద్యామందిర్, శ్యామ్ మోడల్ ప్రైవేట్ పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాసన మండలిలో ప్రజల పక్షాన నిలబడే ప్రతిపక్షాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు నరేందర్‌రెడ్డి, అరిగెలా నాగేశ్వర్‌రావు, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షులు కుంచాల విజయ్, నాయకులు శ్యామల, మోతీరాం, భీమయ్య, బండురావు, తిరుపతి, చందు, మధుకర్, భూమన్న, మిథున్, రవి పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని మండల కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు.

'కాంగ్రెస్‌తోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారం'



ప్రచారం చేస్తున్న యూత్ అధ్యక్షుడు ప్రశాంత్

వాంకిడి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పట్టభద్రుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డోంగ్రి యుగాంత్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు'


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని సీపీఎం జిల్లా కమిటీ ప్రకటించింది. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దినకర్, శ్రీనివాస్‌లు మాట్లాడుతు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నా, లౌకికశక్తి అయిన కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థి విద్యావంతులు, మేధావి నరేందర్‌రెడ్డిని పట్టభద్రులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు కార్తిక్, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

శివలింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠాపన


ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ గ్రామంలోని బీసీ కాలనీలో స్వయంభూగా వెలిసిన రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం వేదపండితులు నిమ్మకంటి సంతోష్ శర్మ, మహేశ్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేసి నూతన శివలింగం, నంది విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకొని తమ మొక్కులు చెల్లించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.